RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 38 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | బుధవారం 07-01 -2026 | పేజీలు -6 | వెల: రూ. 05.00

## విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

# భావితరాల కోసమే హిల్ట్ విధానం

## లేకుంటే హైదరాబాద్‌కు ఢిల్లీ పరిస్థితే

- పారిశ్రామికవేత్తల ఇష్టప్రకారమే ల్యాండ్ కన్వర్షన్
- వద్దనుకుంటే దరఖాస్తు చేసుకోవద్దు
- ఎలాంటి నిర్బంధం లేదు
- అసెంబ్లీలో 'హిల్ట్' పత్రం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్ జనవరి 06 అక్షర వేదం**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని భూగర్భజలాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నాయనీ, పారిశ్రామిక వ్యర్థ రసాయనాలే దీనికి కారణమని రాష్ట్ర పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికీ మేల్కోకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అనుమతితో 'హైదరాబాద్ పారిశ్రామిక భూవినియోగ మార్పిడి విధానం' (హెచ్ఐఎల్‌టీ) పై విధాన పత్రాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హిల్ట్ విధానం, దాని లక్ష్యం, ప్రజలు, ప్రభుత్వానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. హిల్ట్ పాలసీ -మిగతా 2 లో



## పాకిస్తాన్‌కు.... గూఢచార్యం

- 15 ఏండ్ల బాలుడు అరెస్ట్
- దేశ సమాచారం చేర వేసినట్టు గుర్తింపు
- సున్నితమైన ఇన్ఫోని షేర్ చేశాడన్న అధికారులు
- పాక్ ఐఎస్ఐతో సంబంధాలు..
- ఐఎస్ఐ తో సంబంధాలపై విచారణ

**న్యూఢిల్లీ**

పాక్ కోసం గూఢచర్యం వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు భారతీయులు అరెస్టైన విషయం తెలిసిందే. హర్యానా, పంజాబ్, యూపీలో అనేకమంది గుఢచారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా ఓ బాలుడు అరెస్ట్ అయ్యాడు.పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడనే ఆరోపణలపై 15 ఏండ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. ఆ యువకుడు పాక్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధం ఉన్న హ్యాండ్లర్లతో టచ్‌లో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జమ్ములోని సాంబా జిల్లాకు చెందిన బాలుడు దాదాపు ఏడాదిగా భారత సైనిక స్థావరాలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని ఐఎస్ఐ ఏజెంట్లతో పంచుకుంటున్నట్లు -మిగతా 2 లో



## కాలుష్య నివారణకు ఈవి పాలసీ అమలు

- ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు
- అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,జనవరి 06 అక్షర వేదం**

ఈవి వాహనాల బ్యాటరీల సామర్థ్యం పెంపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి పాలసీ కింద తయారీదారులు, డీలర్లతో భేటీ ఏర్పాటు చేశామని అన్నారు. ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం శాసనసభలో పొన్నం మాట్లాడుతూ.. ఈవీ వాహనాల రాయితీ అమలుతో రూ.900 కోట్ల పన్ను నష్టం అని.. ఉద్యోగులు ఈవి వాహనాలు కొనుగోలు చేస్తే 20 శాతం తగ్గింపు ఉంటుందని పొన్నం తెలియజేశారు. ఉద్యోగులకు 20 శాతం వరకు తగ్గించాలని కంపెనీలను కోరామని అన్నారు. ఎంఎన్ సి కంపెనీలు ఈవి వాహనాలు కొనుగోలు చేసేలా విధానం ఉంటుందని, పిఎం ఈ డ్రైవ్ కింద 575 ఆర్టిసి బస్సులు -మిగతా 2 లో




## వాయు కాలుష్యంపై కారణాలు గుర్తించండి..

- సమస్యలు గుర్తిస్తే, పరిష్కారం అదే లభిస్తుంది
- కాలుష్యానికి కారణమవుతున్న నిర్మాణాలు,
- వాహనాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి
- ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీం సూచన

**న్యూఢిల్లీ**

ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్యాన్ని నియంత్రించాలంటే ముందుగా.. కాలుష్యానికి గల కారణాలు గుర్తించాలని సూచించింది. ఈ మేరకు వాయు కాలుష్యంపై ఏర్పాటైన క్యామ్ (కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్)కు ఆదేశాలు జారీ చేసింది. వాయు కాలుష్యానికి పరిష్కారాలు వెతకడానికి ముందు.. కారణాలు కనుగొనడంపై దృష్టి పెట్టాలని సూచించింది.ఢిల్లీలో వాయు కాలుష్యంపై దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. -మిగతా 2 లో




## యూపీలో సర్ ఎఫెక్ట్

- 2.89 కోట్ల మంది పేర్లు తొలగింపు
- లక్నోలో అత్యధికొం డ్రాఫ్ట్ జాబితా విడుదల చేసిన ఈసీ

**న్యూఢిల్లీ జనవరి 06 అక్షర వేదం**

ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్) ప్రభావం భారీగా పడింది. సర్ తరువాత సుమారు 3 కోట్ల మంది ఓటర్లను ఈసీ తొలగించింది. సర్ 2 కోసం మిగిలిన అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన గడువు కన్నా ఉత్తరప్రదేశ్‌లో అదనంగా 15 రోజుల వ్యవధిని ఈసీ ఇచ్చింది. రెండు పర్యాయాలు సర్ గడువును పొడించారు. తాజాగా సర్ ప్రక్రియ పూర్తి చేసిన ఎన్నికల కమిషన్ మంగళవారం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం సర్ తరువాత 2.89 కోట్ల మంది పేర్లను ఈసీ తొలగించింది. -మిగతా 2 లో

# గొడవలు సహజం.. సర్దుకుపోవాలి

## లేదంటే కాంగ్రెస్ నేతలకు సందు దొరుకుద్ది



**కవిత వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన**

**రాహుల్ లీడర్ కాదు..రీడర్**

- రైతులను మోసగించారు
- రోత కూతలు కూసే సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలి :
- బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జనగామ జనవరి 06 అక్షర వేదం**

ఏ కుటుంబంలో అయినా గొడవలు ఉండటం సహజమని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే ఇది సర్వసాధారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శాసనమండలిలో బీఆర్ఎస్ పదేండ్ల పాలనపై కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై ఆయన విలేకరులతో పరోక్షంగా స్పందిం చారు. గొడవలు జరిగినప్పుడు అలుగుడు, గులుగుడు ఉంటాయని, సర్దుకుపోవాలని.. లేదంటే కాంగ్రెస్ నేతలకు సందు దొరుకుద్దని ఆయన వ్యాఖ్యానించారు. జనగామ జిల్లాలో మంగళవారం బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచులు, -మిగతా 2 లో



## టీమ్ వర్క్‌తో రాష్ట్ర బ్రాండ్ నిర్మాణం

- పెట్టుబడుల వెల్లువతో ఆశాజనక పరిస్థితి
- మంత్రులు, అధికారుల పనితీరే కారణం
- పెట్టుబడుల ప్రొత్సాహక బోర్డు సమావేశంలో బాబు

**అమరావతి, జనవరి 06 అక్షర వేదం**

2025 ఏడాదిలో పెట్టుబడులు అద్భుతంగా వచ్చాయని... అదే ఉత్సాహంతో 2026లో పనిచేయాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుసూచించారు. 2025లో అంతా కలిసి టీమ్ వర్క్ చేశామని... అందుకే మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో సీఎం అధ్యక్షతన 14వ ఎస్ఐపీబీ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రొత్సాహక బోర్డు -మిగతా 2 లో



## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- బడ్జెట్ తేదీపై సందిగ్ధం
- కీలక బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ**

ఆర్థిక సంవత్సరానికి (2026-27) బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజున పార్లమెంట్ ఉభయ సభల సమావేశం జరగనుంది. సభనుద్దే శించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించను న్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏ తేదీన బడ్జెట్ ప్రవేశపెడతారనే విషయంపై స్పష్టతరావాల్సి ఉంది. 2017 నుంచి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 ఆదివారం రావడంతో, బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తమవు తుంది. దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. -మిగతా 2 లో

## కవిత రాజీనామా ఆమోదం

- ఈసీకి నోటిఫికేషన్ పంపిన కార్యదర్శి




**హైదరాబాద్ జనవరి 06 అక్షర వేదం**

ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామాను శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గంనుంచి ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమెను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్‌చేసిన తర్వాత ఆమె తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. సెప్టెంబర్‌లో ఆమె తన -మిగతా 2 లో

## జపాన్‌లో భారీ భూకంపం

- రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.2గా నమోదు
- ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అక్కడి అధికారులు వేల్లడి



**న్యూఢిల్లీ**

జపాన్ లో భూకంపం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున పశ్చిమ జపాన్ తీరంలో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.2గా నమోదైనట్లు జపాన్ వాతావరణ సంస్థ తెలిపింది. షిమనే ప్రిఫెక్చర్ లో ఉదయం 10:18 గంటలకు ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని అక్కడి అధికారులు తెలిపారు. అలాగే, ఈ భూకంపం వల్ల సునామీ ముప్పు కూడా లేదని స్పష్టం చేశారు. భూకంపం ధాటికి పలు భవనాలు ఊగిపోయాయి. ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

# భావితరాల కోసమే హిల్ట్ విధానం

మొదటి తరువాయి

ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాస ప్రాంతంగా మారుతుందని చెప్పారు. హైదరాబాద్ సిటీలోని పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) అవతలివైపునకు తరలిస్తామని చెప్పారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని గుర్తు చేశారు. జీడీమెట్ల, ఉప్పల్, సనత్‌నగర్, చర్లపల్లి ప్రాంతాలు గతంలో ఇండిస్టియల్ జోన్లుగా జనావాసాలకు దూరంగా ఉండేవనీ, 50 ఏండ్లల్లో హైదరాబాద్ మహానగరంగా విస్తరించి, శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం రెసిడెన్షియల్ కాలనీలుగా మారాయని చెప్పారు. ఇప్పుడు అక్కడ లక్షలాది మంది పౌరులు నివసిస్తున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం పరిశ్రమలకు పక్కనే అపార్ట్‌మెంట్లు వెలిసాయనీ, అక్కడి ప్రజలు ఇప్పటికే కాలుష్యకష్టాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఇండిస్ట్రీలు, రెసిడెన్షియల్ ప్రాంతాలకు మధ్య బఫర్ జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే ఎల్జీ పాలిమర్స్, భోపాల్ గ్యాస్ వంటి దుర్ఘటనలు జరిగాయని ఉదహరించారు. హిల్ట్ పాలసీ విషయంలో ప్రతిపక్షలు రాజకీయాలను పక్కనపెట్టాలని కోరారు. చైనాలో భూస్కై పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను నగరం నుంచి అవతలకు తరలించారని చెప్పారు. తద్వారా ప్రపంచదేశాలకు చైనా ఆదర్శంగా నిలిచిందన్నారు. పారిశ్రామిక ప్రగతి



కంటే ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఢిల్లీలో జనావాసాల మధ్య ఉన్న 168 పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని సభ దృష్టికి తెచ్చారు. ఈ తీర్పు ప్రాతిపదికగా హిల్ట్ విధానం తీసుకొచ్చామన్నారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదన్నారు. పూర్వీకులు స్వచ్ఛమైన ప్రకృతిని మనకు వారసత్వంగా అందించారనీ, మనం కూడా రేపటితరానికి స్వచ్ఛమైన ప్రకృతిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. దానికోసమే హిల్ట్ పాలసీ తెచ్చామన్నారు. ప్రతిపక్షలు హిల్ట్ పాలసీని సాదాసీదా భూ మార్పిడిగా చూస్తున్నారనీ, కానీ దీని పరిధి చాలా విస్తృతమైందని వివరించారు. హిల్ట్ విధానంపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామన్నారు. జీవో నెంబరు 19కి సంబంధించి లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చిందనీ, స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకు వస్తే కొంత ఫీజు తీసుకుని ల్యాండ్ కన్వర్షన్ చేస్తామన్నారు. 2013లోనే రెడ్, ఆరెంజ్ పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రులు భూ యజమానులు కాదనీ, ప్రభుత్వంలో ఉన్న ట్రస్టీలు మాత్రమేనని చెప్పారు. భూ మార్పిడిపై బలవంతం ఏమీలేదన్నారు. పారిశ్రామికవేత్తలకు ఇష్టమైతేనే భూ మార్పిడి చేస్తామని వివరించారు. విధానం బయటకు రాకముందే ప్రతిపక్షలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయనీ, ఆ పద్ధతి మార్చుకోవాలనీ, ఇప్పటికైనా పర్యావరణ విధ్వంసం ఆగాలని అన్నారు.

# కాలుష్య నివారణకు ఈవి పాలసీ అమలు

మొదటి తరువాయి

నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా 200కు పైగా ఈవి బస్సులు వస్తున్నాయని, వరంగల్ లో 100, నిజామాబాద్ లో 50 బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేయాలని, స్క్రాప్ పాలసీ కింద ప్రోత్సాహం ఇచ్చేలా జివో తీసుకువచ్చామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఈవీ పాలసీని తీసుకువచ్చామని, ఈ ఏడాది కాలంలో లక్ష ఈవీ వాహనాలు అమ్ముడయ్యాయని వెల్లడించారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద కేంద్రం సబ్సిడీ ఇస్తుంది.. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద సబ్సిడీ ఇస్తుందా? కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉందని తెలిపారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం లేదని.. తెలంగాణలో 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలే నడుస్తున్నాయని వెల్లడించారు. పొల్యూషన్ తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి.. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ.. ప్రోత్సహించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. త్రీ వీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రమోట్ చేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. 'హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ చేయాలంటే.. ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలి.. ఎలక్ట్రిక్, సోలార్ ప్యానెల్ తో నడిచే వాహనాలను ప్రోత్సహించాలి.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలి.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.. ఇవీ పాలసీని తీసుకుని వస్తున్నందుకు ధన్యవాదాలు' అని ఎమ్మెల్యే వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# గొడవలు సహజం..సర్దుకుపోవాలి

మొదటి తరువాయి

వార్డు సభ్యుల అభినందన కార్యక్రమాన్ని జనగామలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు జనగామలో రోడ్ షో నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ లీడర్ కాదని.. రీడర్ అని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలను మోసం చేశాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన



రాహుల్‌గాంధీ మాటలు విని ప్రతి నిరుద్యోగి విద్యార్థి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయించారని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలను మరిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో రోత కూతలు కూస్తున్నారని విమర్శించారు. ఆడబిడ్డలకు బతుకమ్మ చీర పెట్టే మొఖం లేని, ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇవ్వలేని సీఎం రేవంత్ రెడ్డి.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. జనగామ ర్యాలీ చూస్తే కేసీఆర్.. మరోసారి ముఖ్యమంత్రి అయ్యారనిపిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులు చేసినా, ఒత్తిడులకు గురిచేసినా పార్టీ కోసం నిలబడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు అని తెలిపారు. గెలిచిన ప్రతి ఒక్క సర్పంచ్.. మున్సిపల్ ఎన్నికల్లోనూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జనగామ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ప్రేమలతా రెడ్డి, పోకల జమున, నాయకులు సిద్ధి లింగం, బండ పద్మ, మేకల కళింగ రాజు తదితరులు పాల్గొన్నారు.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

**ఈ సమావేశాల్లో కీలక బిల్లు ?**



ఈ బడ్జెట్ సమావేశాల్లో వన్ నేషన్- వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. 30 రోజులకు పైగా జైలు జీవితం గడిపే సిఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే బిల్లును కూడా ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్టు సమాచారం.

# కవిత రాజీనామా ఆమోదం

మొదటి తరువాయి

రాజీనామా పత్రం మండలి చైర్మెన్‌కు ఇచ్చారు. చివరిసారిగా ఆమె మండలిలో సోమవారం భావోద్వేగంగా మాట్లాడిన విషయం తెలిసిందే.ఈ మేరకు ఈసీకి నోటిఫికేషన్ అసెంబ్లీ కార్యదర్శి పంపారు.



## పాకిస్తాన్‌కు.... గూఢచార్యం

మొదటి తరువాయి



గుర్తించామన్నారు. ఇక ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐఎస్‌ఐ గూఢచర్య కార్యకలాపాల కోసం మైనర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తేలింది. పంజాబ్‌లోని పలువురు మైనర్ బాలురకు ఐఎస్‌ఐ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ముందుజాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్లను అధికారులు అప్రమత్తం చేశారు.

## వాయు కాలుష్యంపై కారణాలు గుర్తించండి..

మొదటి తరువాయి

సమస్యకు మూలాలు, కారణాలు కనుక్కోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నా లాభం లేదని అభిప్రాయపడింది. రెండు వారాల్లోగా వివిధ రంగ నిపుణులను గుర్తించి, వారితో చర్చించి, ఢిల్లీ వాయు కాలుష్యానికి గల కారణాలు తెలుసుకోవాలని ఆదేశించింది. వివిధ రంగాలకు చెందిన నిపుణుల్ని గుర్తించి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం, సరైన వివరాలు నమోదు చేయడం క్యామ్ బాధ్యత అని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాల్ని ప్రజలకు అందుబాటులో ఉంచి, జవాబుదారీతనాన్ని పాటించాలని సూచించింది. వాయు కాలుష్యంపై కోర్టుకు పూర్తి అవగాహన లేకపోవచ్చని, అయితే, నిపుణుల ద్వారా సరైన నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపింది. సమస్యలు గుర్తిస్తే, పరిష్కారం అదే లభిస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఎక్కువ వాయు కాలుష్యానికి కారణమవుతున్న వాటిని ముందుగా గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకెళ్లాలని, అయితే, క్యామ్ కు అంత తొందరేం కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఏటికేడు ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోతున్న విషయాన్ని గుర్తించాలని సూచించింది. కాలుష్యానికి కారణమవుతున్న నిర్మాణాలు, వాహనాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని కోరింది.

## యూపీలో సర్ ఎఫెక్ట్

మొదటి తరువాయి

అత్యధికంగా రాజధాని లక్నోలో 12 లక్షల మంది (30 శాతం) ఓటర్ల పేర్లు తొలగించారు. సర్‌కు ముందు ఇక్కడ 39.9 లక్షల మంది ఓటర్లు ఉండగా, డ్రాఫ్ట్ జాబితాలో ఈ సంఖ్య 27.9 లక్షలకు పడిపోయింది. సకు ముందు ఉత్తరప్రదేశ్ ఓటర్ల జాబితాలో మొత్తంగా 15.44 కోట్ల మంది పేర్లు ఉండేవి. మరణాలు, శాశ్వత వలసలు, ఒకటి చోట కంటే ఎక్కువ ప్రదేశాల్లో నమోదులు వంటి కారణాలతో 2.89 కోట్ల మంది పేర్లు తొలగించినట్టు ఉత్తరప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. 12.55 కోట్ల మంది పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో అలాగే ఉంచినట్లు నవదీప్ రిన్వా వెల్లడించారు. మరణాల కారణంగా 46 లక్ష మంది పేర్లు, శాశ్వత వలసల కారణంగా 2.17 కోట్ల మంది పేర్లు, ఒకటి చోట కంటే ఎక్కువ ప్రదేశాల్లో నమోదు కారణంగా 25.47 లక్షల మంది పేర్లు తొలగించినట్టు నవదీప్ రిన్వా వివరించారు. ఈ డ్రాఫ్ట్ జాబితాను ఓటర్లకు అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. ఈసీఐఎన్ఈటీ, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఈ డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించి, ఓటర్లు తమ పేరు ఉందో.. లేదో ..తెలుసుకోవచ్చునని చెప్పారు. ఒకవేళ ఎవరి పేరైనా లేకపోయినా.. వివరాల్లో తప్పిదాలు కనిపించినా.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. ఈ జాబితాపై క్లెయిమ్‌లు, ఫిర్యాదులు, అభ్యంతరాల కోసం ప్రత్యేక విభాగాన్ని మంగళవారం నుంచే ప్రారంభించామని తెలిపారు. ఫిబ్రవరి 6 వరకూ వీటిని స్వీకరిస్తామని చెప్పారు. వీటిని పరిష్కరించిన తరువాత మార్చి 6న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. కాగా, సర్ 2 దశను ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరిలతో పాలు సమానంగానే ఉత్తరప్రదేశ్‌లో కూడా ఈ ప్రక్రియను ప్రారంభించారు. అయితే యూపీ మినహా మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిసెంబరు 11న సర్ ప్రక్రియ ముగిసింది. డ్రాఫ్ట్ జాబితాలను ఇప్పటికే విడుదల చేశారు.

## టీమ్ వర్క్‌తో రాష్ట్ర బ్రాండ్ నిర్మాణం

మొదటి తరువాయి

సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి మంత్రులు, అధికారులు అద్భుతంగా పని చేశారంటూ కితాబిచ్చారు. గత ప్రభుత్వ పాలనలో పోయిన బ్రాండ్ తిరిగి వచ్చిందని.. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. భారీ పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయని సీఎం అన్నారు. ఏ చిన్న పొరపాటు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.. విద్యుత్ రంగంలో అద్భుతంగా పనిచేశామన్నారు. 13 పైసలు విద్యుత్ ఛార్జీలు తగ్గించామని సీఎం వెల్లడించారు. రూ. 4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూడడం తనకు చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేసిన కృషి వల్లే డేటా సెంటర్లు వచ్చాయని సీఎం తెలిపారు. విద్యుత్ రంగంతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులు బాగా వచ్చాయన్నారు. దావోస్ సదస్సుకు వెళ్లామని.. ఏపీ బ్రాండ్ ప్రమోట్ చేయగలిగామని అన్నారు. అలాగే విదేశీ కంపెనీలను ఆకర్షించగలిగామని సీఎం తెలిపారు. గూగుల్ సెంటర్ ఏపీకి తీసుకురావడానికి లోకేష్ కృషి చేశారని తెలిపారు. సక్సెస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుందని... ఆ కిక్ కోసం అందరూ పని చేయాలని సూచించారు.

# లక్ష్మీనగర్ ఆర్అండ్ఆర్ సైట్‌లో మౌలిక వసతుల కొరతపై కలెక్టర్ ఆగ్రహం...





**- ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

అక్షర వేదం:జనవరి 06,రామగిరి
రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మి నగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల కొరతపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సీరియస్ అయ్యారు.రామగుండం కోల్ మైన్ విస్తరణకు సంబంధించి ఇటీవల నిర్వహించిన మెగా పబ్లిక్ హియరింగ్‌లో లక్ష్మి నగర్ అభివృద్ధిపై తీవ్ర స్థాయిలో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో,కలెక్టర్ స్వయంగా కాలనీని సందర్శించి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.డిసెంబర్ 19న నిర్వహించిన మెగా కోల్ మైన్ ప్రజాభిప్రాయ సేకరణలో రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు,లధ్నాపూర్ సర్పంచ్ వనం రామచందర్ రావు,పలువురు స్థానిక నాయకులు లక్ష్మి నగర్ ఆర్అండ్ఆర్ ప్లాట్లలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.మైనింగ్ విస్తరణ కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి కాలనీని పరిశీలించారు.కలెక్టర్ పర్యటన సందర్భంగా లక్ష్మి నగర్ కాలనీవాసులు తమ గోడును వెల్లబోసుకున్నారు.విద్యుత్ సరఫరా సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేనందున మురుగు నీరు ఎక్కడికక్కడ మురికి కుంటలుగా ఏర్పడడంతో ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని, కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని,తాగునీటి పైప్ లైన్ వ్యవస్థ లేక రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. లక్ష్మి నగర్ అభివృద్ధి కోసం ఇటు ప్రభుత్వానికి,అటు సింగరేణి యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు,విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవడం తమను తీవ్ర నిరాశకు గురి చేసిందని కాలనీవాసులు పేర్కొన్నారు.నిర్వాసితుల పునరావాసం అనేది కేవలం ప్లాట్లు కేటాయించడమే కాకుండా,సంపూర్ణ మౌలిక వసతులు కల్పించి గౌరవప్రదమైన జీవనానికి మార్గం సుగమం చేయాలని వారు స్పష్టం చేశారు.ప్రజాభిప్రాయ సేకరణలో లేవనెత్తిన అంశాలపై సుదీర్ఘంగా విచారణ చేపట్టి,లక్ష్మి నగర్ ఆర్అండ్ఆర్ కాలనీ అభివృద్ధిలో ప్రభుత్వ శాఖలు,సింగరేణి సంస్థ సంపూర్ణ బాధ్యతతో వ్యవహరించాలని కాలనీవాసులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు.సమస్యలు పరిష్కరించకుండా మైనింగ్ విస్తరణకు అనుమతులు ఇవ్వడం అన్యాయమని, ముందుగా ఆర్అండ్ఆర్ కాలనీల అభివృద్ధి పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ పర్నంది సుమన్, సింగరేణి ఎస్టేట్ మేనేజర్ కలవేన ఐలయ్య, ఎన్విరాన్‌మెంట్ ఏజీఎం పార్థిరెడ్డి రాజిరెడ్డి,సివిల్ డీజీఎం బి.రాజేంద్ర కుమార్,వార్డు సభ్యులు పెద్ద ఎత్తున కాలనీవాసులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు: కమిషనర్

అక్షర వేదం:జనవరి 06,రామగిరి
జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డా:.గోవర్ధన్ అన్నారు.మంగళవారం జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో ప్రయాస్ ఐదవ షెడ్యూల్ లో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్ల్యు ఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 241 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు కు అందజేశారు.ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డా. గోవర్ధన్ మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు.ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు.పెండింగ్ లో ఉన్న సిఎంపిఎఫ్ క్లెయిమ్స్,రివైజ్డ్ పెన్షన్ తదితర అంశాలపై చర్చించారు,ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు.పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలనీ చెప్పారు.రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపిఎఫ్ వివరాలను చూసే సిబ్బంది సీఎంపిఎఫ్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని,ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,డివై పియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓ పి.రాజేశం,ఫైనాన్స్ అధికారి భరత్, సిఎంపిఎఫ్ సిబ్బంది కామేశ్వర రావు,లలిత, అనిత,మనోహర్,ప్రదీప్ రెడ్డి తో పాటు వివిధ గనుల సంక్షమ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




# సమయానికి చికిత్సతో ప్రాణాపాయం తప్పింది

**23 ఏళ్ల యువకుడికి భారీ గుండెపోటు ప్రాణాలను కాపాడిన టచ్ ఆసుపత్రి**

అక్షర వేదం,మంచిర్యాల, జనవరి 06
మంచిర్యాల జిల్లా లోని టచ్ హాస్పిటల్‌లో అరుదైన హృదయ చికిత్సతో ఓ యువకుడి ప్రాణాలు కాపాడారు. మంచిర్యాల జిల్లా కన్నెపెల్లి మండలం గొల్లగట్టు గ్రామానికి చెందిన వెంకటేష్ (23)కు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చేరిన వెంటనే నిర్వహించిన పరీక్షల్లో అతనికి భారీ గుండెపోటు (మాసివ్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) వచ్చినట్లు వైద్యులు గుర్తించారు.రోగి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో కార్డియాలజిస్ట్ డా. రాజేష్ భోర్కుందే తక్షణమే యాంజియోగ్రఫీ చేయించారు. ఈ పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన ధమని పూర్తిగా (100 శాతం) మూసుకుపోయినట్లు వెల్లడైంది. ఆలస్యం చేస్తే గుండె కండరాలకు శాశ్వత నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో, డా. రాజేష్ భోర్కుందే నేతృత్వంలోని వైద్య బృందం అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి ధమనిని విజయవంతంగా తెరిచారు. చికిత్స అనంతరం యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స అందించడంతో కుటుంబానికి ఆర్థిక భారం తప్పింది.ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించారు. జన్మభూమి నగర్‌లోని టచ్ హాస్పిటల్ అత్యవసర హృదయ చికిత్సలో మరోసారి తన నైపుణ్యాన్ని చాటుకుందని స్థానికులు ప్రశంసించారు.



# ప్రసవం పోసిన 108 సిబ్బంది తల్లి బిడ్డ సురక్షితం

**- 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ పడాల అభిరామ్**



అక్షర వేదం:జనవరి 06,రామగిరి
పెద్దపల్లి జిల్లా రామగిరి మండల్ లొంకకేసారం గ్రామంలోని సాయి ఇటుక బట్టి లలో పనిచేసే బీహార్ మహిళా తొమ్మిది నెలల గర్భిణీ తో ఉండడం జరిగింది.నొప్పులు రావడంతో 108 కి సమాచారం అందజేయగా బసంత నగర్ 108 అంబులెన్స్ తక్షణమే సమాచారం అందుకొని లొంకకేసారం గ్రామానికి చేరుకొని గర్భిణీ స్త్రీని పెద్దపెల్లి మాతా శిశు ఆసుపత్రికి తరలించే మార్గం మధ్యలో భరించలేనంత నొప్పులు రావడంతో 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ పడాల అభిరామ్ గర్భిణీ స్త్రీ పరిస్థితి చూసి అంబులెన్స్ పక్కన నిలిపి అక్కడి నార్మల్ డెలివరీ చేయడం జరిగింది ఆడబిడ్డ జన్మించింది బొడ్డు పేగు కత్తిరించి,పాపకు సంబంధించిన మందులు ఇచ్చి తల్లి బిడ్డల్ని సురక్షతంగా వైద్యం చేసుకుంటూ పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రికి తరలించారు రెండు ప్రాణాలు సురక్షతంగా ఉన్నాయని వారి కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.108 వల్ల ఎన్నో ప్రాణాలు నిలుస్తున్నాయి రోడ్డు ప్రమాదాలు కావచ్చు,గర్భిణీ స్త్రీలకు,మరెన్నో సమస్యలకు 108 సిబ్బంది ఒక్క ఫోనుతో ఆ కుటుంబ సభ్యులకు మేమున్నామంటూ తక్షణమే చేరి ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నారు.మీ సేవలు అమూల్యమైనవి అని ప్రజలు హర్షం వ్యక్తపరిచారు.108 వాహనంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పడాల అభిరామ్,పైలట్ వేగోలపు అనీల్ కుమార్,ఆశ వర్కర్ శారద ఉన్నారు.

# అంతక్రియలలో పాల్గొన్న తపస్ జిల్లా సభ్యులు...

**- బత్తిని వీరాస్వామి గౌడ్, తపస్ హన్మకొండ జిల్లా అధ్యక్షుల అమ్మ అంత్యక్రియలు**

**- నివాళులు అర్పించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ జిల్లా సంఘం**



(అక్షర వేదం ప్రతినిధి, పంతిని, వర్ధన్నపేట్)
బత్తిని వీరస్వామి గౌడ్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు అమ్మ బత్తిని అనసూర్య అంత్య క్రియాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాపగిరి శ్రీనివాస్ మాజీ ప్రధాన కార్యదర్శి సంగం శ్రీనివాస్, మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మాచర్ల బిక్షపతి,సురేందర్ జీ, అలిగిరెడ్డి రాజేందర్ రెడ్డి, సాంబరాజు, దేవునూరి శ్రీనివాసు,జి. బాను ప్రసాద్,రామకిషన్ సంఘ నాయకులు బంధుమిత్రులు పాల్గొని అనారోగ్యంతో పరమపదించిన బత్తిని అనసూయ కి ఘనంగా నివాళులు అర్పించి, మరి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు.అనంతరం వారి కుమారులు బత్తిని సమ్మయ్య వీరస్వామిగౌడ్, ఎల్లగౌడ్ లను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

# అభివృద్ధికి సహకరించాలని అధికారులకు విజ్ఞప్తి

**-చేసిన జూలపల్లి గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్**





హైదరాబాద్, జనవరి 06 (అక్షర వేదం) :
పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలం జూలపల్లి గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత మంగళవారం సాయికుమార్ పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా కమాన్పూర్ మండల అభివృద్ధి అధికారి ప్రియాంక తోపాటు ఎంపీఓ సౌమ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ హనుమాన్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



అక్షర వేదం:జనవరి 06,రామగిరి

శ్రీ హనుమాన్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ సెంటనరి కాలనీ గౌరవ అధ్యక్షులు పి.వి రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగ ఎన్నుకోబడింది అధ్యక్షులుగా మెడ గోని మల్లేష్, ఉపాధ్యక్షులు బొంకూరి మహేష్,కోశాధికారి బుర్ర రాజశేఖర్ ను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఓనర్స్, డ్రైవర్స్ అందరూ పాల్గొన్నారు.

## సిద్దపల్లి వద్ద ఉద్రిక్తత అక్రమ కట్టడాలు అంటూ కలెక్టర్ సమక్షంలో కూల్చివేత

**- ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు,భారీగా ట్రాఫిక్ జామ్**





అక్షర వేదం: జనవరి 06,రామగిరి

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధి సిద్ధపల్లి వద్ద ఉద్రిక్తత నెలకొంది. రామగుండం 3 ఏరియా ఓసీ2 విస్తరణలో భాగంగా మండలంలోని రాజాపూర్, బుధవారంపేట పంచాయతీ పరిధి సిద్ధపల్లిని సేకరించడానికి సింగరేణి పనులను ప్రారంభించింది. కొద్దిరోజుల క్రితమే రాజాపూర్ గ్రామానికి అధికారులు వచ్చి ఇండ్లకి నంబర్ల వేయడం జరిగింది.అనంతరం సిద్ధపల్లి వద్ద ఇండ్లకి నెంబర్లు వేయడానికి ప్రయత్నించగా బుధవారంపేట గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం పేట గ్రామాన్ని సింగరేణి పూర్తిగా సేకరించాలని,లేదంటే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా మంగళవారం రామగిరి పర్యటనలో భాగంలో సిద్ధపల్లికి వచ్చిన కలెక్టర్ అక్రమ కట్టడాల నెపంతో సిద్ధపల్లి వద్ద రెవెన్యూ,సింగరేణి అధికారుల సమక్షంలో ఇండ్లను కూల్చివేశారు.దీంతో ఆగ్రహించిన బుధవారంపేట,రాజాపూర్ గ్రామస్తులు మంథని పెద్దపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా నోటీసులు ఇవ్వకుండా ఎవరు లేని సమయంలో ఇండ్లను ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంఘటన స్థలానికి చేరుకున్న రామగిరి ఎస్సై శ్రీనివాస్ గ్రామస్తులతో చర్చలు జరుపుతున్నారు.దీంతో మంథని పెద్దపల్లి ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి...జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**రామగిరి మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**





అక్షర వేదం: జనవరి-06,రామగిరి

మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలం చందన పూర్ గ్రామంలో జడ్పిహెచ్ఎస్, ఎంపిపిఎస్ పాఠశాలలను,రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్,లక్ష్మి నగర్ ఆర్ & ఆర్ కాలనీ, ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాఠశాలలో పిల్లలకు అందుతున్న విద్యా ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించారు.ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులపై అధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు యూ.ఐ.డి.సి లో అప్ డేట్ చేయాలని అన్నారు. పాఠశాలలో ఏదైనా అవసరాలు ఉంటే ప్రతిపాదన సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం రత్నాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీని పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. అంతకుముందు కమాన్ పూర్ మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ కార్యాలయం పనులను కలెక్టర్ పరిశీలించి రెండు నెలల లోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు నూతన తహసిల్దార్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ సుమన్,ఎంపీడీవో శైలజ రాణి, మంథని డీ.ఈ పి.ఆర్ అప్పల నాయుడు,ఏఈ లు వర లక్ష్మి జగదీష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపద వేళ సర్పంచ్ గుర్తుకు రావాలి.!!

**- మీ చేతుల్లోనే బహుజన వాద భవిష్యత్తు**
**- పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించిన జస్టిస్ చంద్రకుమార్**
**- హుజన ప్రజాస్వామ్యక వేదిక ఆధ్వర్యంలో సర్పంచులకు సన్మానం**



పెద్దపల్లి, అక్షర వేదం ప్రతినిధి:

-గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా మీరు అండగా ఉంటారని గుర్తుకు రావాలి..అలా ఐతే రేపు రెట్టింపు మెజార్టీ వస్తుంది.బహుజన వాద భావజాలాన్ని పల్లెల వరకు విస్తరించాలని సర్పంచుల చేతుల్లోనే బహుజన వాదం భవిష్యత్తు ఆధారపడి ఉందని మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి చంద్రకుమార్ వెల్లడించారు మంగళవారం పెద్ద పెల్లి జిల్లాకు చెందిన బడుగు బలహీన వర్గాలకు చెందిన సుమారు వందమంది సర్పంచులకు హైకోర్టు చీఫ్ జస్టిస్ బి చంద్రకుమార్ తో పాటు మాజీ జెడ్పిటిసి గోపగాని సారయ్య గౌడ్ లు సన్మానించారు ఈ సమావేశానికి బహుజన ప్రజాస్వామిక వేదిక అధ్యక్షులు తాడూరి శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ బి చంద్రకుమార్ మాట్లాడుతూ సర్పంచుల కు పంచాయతీరాజ్ చట్టం లోని ముఖ్య అంశములను సర్పంచులకు తెలిపారు సర్పంచులు చట్టాన్ని అనుసరించి పరిపాలన సాగించాలని కోరారు ప్రభుత్వం సర్పంచులపై భారమైన బాధ్యత మోపిందని చట్టంలో మతసామరస్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ కు తోడ్పడాలని ఉందని పేర్కొన్నారు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి ఆడిట్ నివేదిక పంపకపోతే సర్పంచి పదవిని కలెక్టర్ సస్పెండ్ చేయవచ్చనే చట్టం పొందుపరిచారని తెలిపారు అలాగే గ్రామ సభ తో పాటు సాధారణ సమావేశాలు నిర్ణీత గడవలోక పెట్టకుండా గ్రామపంచాయతీ నడుపుతాను అంటే పదవి కోల్పోయే ప్రమాదం కలెక్టర్ చేతుల్లో ఉందని తెలిపారు రెండు నెలలకు ఒకసారి జరిగే గ్రామ సభలో మహిళా సమస్యలను ప్రస్తావించాలని చట్టంలో ఉందని జస్టిస్ బి చంద్రకుమార్ తెలిపారు మహిళా సర్పంచులకు మాత్రం ఆరు నెలలుగా ఆరోగ్య సమస్యలతో బాధపడినట్లయితే సమావేశాలకు రాకున్నా వారి సర్పంచి పదవికి ప్రమాదం లేదని తెలిపారు మహిళలకు మాత్రం సహేతుకమైన ఆరోగ్య కారణాలతో వెసులుబాటు లభిస్తుందని జస్టిస్ చంద్రకుమార్ తెలిపాంసర్పంచులు తమ గ్రామాలలో ప్రజలపై ప్రేమతో తమ విధానాలను అమలు చేయాలని సూచించారు సర్పంచులుగా గెలిచారంటే ప్రేమ తత్వం మీ హృదయాలలో నిలిచి ఉందని ఓటర్లు మీ గ్రామంలో చెప్పినట్లు అయిందని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంధ వేణి సునీతతో పాటు ప్రముఖ రచయిత ఏలేశ్వరం వెంకటేశ్వర్లు జిల్లా కాపు సంఘం అధ్యక్షులు సర్పంచ్ రామస్వామి రైతు సంఘం నాయకులు మల్లన్న తో పాటు వివేక్ పటేల్ కోమటిపల్లి రాజేందర్ భీమోదు సురేందర్ బూతగడ్డ సంపత్ బొడ్డుపల్లి శ్రీనివాస్ మరియు వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు 18 కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు

## ఎస్ టీ పి పి లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**- జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్**



అక్షర వేదం, జైపూర్ జనవరి 06

మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండల కేంద్రాన్ని ప్రభావిత ప్రాంతంగా పరిగణించి, నేరుగా సందర్శించి ఎస్టిపిపి యాజమాన్యం పరిశీలించాలని స్థానిక సర్పంచ్ భాస్కర్ విజ్ఞప్తి చేశారు.మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ప్లాంట్ ఈడి చెన్నకేశవుల చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధిలో భాగం కావాలని కోరారు.స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను బలపరచాలన్నారు. ప్లాంట్ అధికారులు వారి కోరికలన్నీ మన్నించి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ కుమార్, వార్డ్ సభ్యులు సతీష్, నవీన్ నాయకు మాజీ ఎంపీటీసీ మంతెన లక్మన్, అంబల్ల సంపత్ రెడ్డి, రవీందర్ రెడ్డి ,లింగయ్య, అరిగల శ్రీనివాస్. ప్రశాంత్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

## చిన్న ఓదాల గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో తొలి పూజ కార్యక్రమం



అక్షర వేదం/మంథని,జనవరి6:

చిన్న ఓదాల గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ధూప దీప నైవేద్యం తొలి పూజా కార్యక్రమంలో మంగళవారం రోజున పురోహితులు లోకే జితేందర్,సర్పంచ్ నాగుల శారద రాజయ్య,ఉప సర్పంచ్ వేముల శ్రవణ్ కుమార్,వార్డు సభ్యులు దువాసి సదయ్య, జంజర్ల మొగిలి,ముత్యాల రాజేష్,లింగాల నరేష్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల దుద్దిల్ల శ్రీధర్ బాబు అభయాంజనేయ స్వామి ఆలయానికి దూపదూప నైవేద్యం పథకం మంజూరు ఇచ్చి స్వామివారికి నిత్యం పూజలు అందుకునే విధంగా చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఆ భగవంతుడు ఎల్లప్పుడు తోడునీడగా ఉండాలని ఆ దేవుడిని వేడుకున్నారు. ఆ కార్యక్రమ అనంతరం పురోహితులు లోకే జితేందర్ కు మడి వస్త్రములు, కండువాతో వారిని ప్రత్యేకంగా సన్మానించారు..

## వ్యవసాయ బోరును ధ్వంసం చేసిన దుండగులు





అక్షర వేదం, చెన్నూరు, జనవరి 06

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం లోని సుందరశాల గ్రామానికి చెందిన నరిగే మొండి వ్యవసాయం పైన ఆధారపడీ గత 20 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న వ్యవసాయ బోరు ను అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల జరిగిన స్థానిక సర్పంచ్ ఎలక్షన్లో తమకు సపోర్ట్ చేయలేదని కక్ష సాధింపుతో రైతు బోరును ధ్వంసం చేసిన సుందరసాల గ్రామానికి చెందిన గుండా సత్యనారాయణ రెడ్డి,భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి గా ఆరోపిస్తున్న రైతు.జనవరి ఒకటి తారీకున బోరు పైపులు పీకి పక్కన పడేయడంతో అదేరోజు సాయంత్రం చెన్నూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీస్ లు చెప్పిన మేరకు రైతు నరిగే మొండి మళ్లీ పైపులను బిగించి వ్యవసాయ భూములకు నీరు పారించడం జరిగింది.కానీ మళ్లీ ఆ బోరు ను ధ్వంసం చేసి నీరు పారకుండా చేశారు.నరేగా మొండి తన 8 ఎకరాల పొలానికి నీరు పారకుండా అవడంతో తీవ్ర నష్టానికి గురవుతానని ఆందోళన చెందుతున్నాడు.వీరు ముగ్గురితో తమకు ప్రాణహాని కూడా ఉందని తీవ్ర భయాందోళనలతో బ్రతుకుతున్న కుటుంబ సభ్యులు.తమ వ్యవసాయ బోరును తిరిగి పనిచేసేలా చేయాలని మొండి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసిన యాదవ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, బీసీ, ఎస్ సి, ఎస్ టీ రాష్ట్ర నాయకులు సిద్ధి రమేష్ యాదవ్ పేర్కొన్నారు.

## కోతులను భయపెడుతున్న ఎలుగుబంటి వేషం



అక్షర వేదం, జైపూర్, జనవరి 06

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని గంగిపల్లిలో కోతుల బెడదను తప్పించేందుకు కొత్తగా ఎన్నికైన ఉప సర్పంచ్ వినూత్న ఆలోచన చేశాడు.మంగళవారం ఎలుగుబంటి వేషం దుస్తులను పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు అందించాడు.పంచాయతీ సిబ్బంది లోని మల్టీపర్పస్ కార్మికుడు సుందిళ్ల ప్రవీణ్ కుమార్ ఎలుగుబంటి వేషధారణ దుస్తులను ధరించి గ్రామమంతా తిరుగుతూ కోతులను బెదిరిస్తూ ఊరు నుండి బయటికి తరిమికొట్టాడని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్ష్మనారాయణ మాట్లాడుతూ గ్రామంలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని,కోతుల బెడదను తప్పించేందుకు ఎలుగుబంటి వేషం దుస్తులు అందించినందుకు ఉప సర్పంచ్ అంజిరెడ్డిని గ్రామస్తులతో కలిసి అభినందించారు. ఆ వేషం చూసి కోతులు పారిపోవడం పై గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఇలాంటి ఎలుగుబంటి దుస్తులను మరో రెండు మూడు తెప్పించి కోతులు రాకుండా చేయడానికి చర్యలు చేపట్టాలని కొత్త పాలకవర్గాన్ని కోరారు.

# హత్య కేసు చేదించిన చెన్నూరు పోలీసులు





**అభినందించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**కేసు క్షత్రస్థాయిలో పరివేక్షణ చేసిన జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు**

**అక్షర వేదం,చెన్నూరు,జనవరి 06**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలో గత నెల రోజుల క్రితం కూలి పని కోసం 20 మంది కూలీలు చెన్నూరు మండలం సుబ్రంపల్లి గ్రామ శివారులో మహమ్మద్ హవాజుద్దీన్ తండ్రి పేరు సిరాజుద్దీన్ చెందిన ఇటుక బట్టీల్లో పనిచేయుటకు కూలీలుగా వచ్చినారు అక్కడే కలిసి రూములో ఉంటున్నారు అలాగే ఏ 1,ఏ 2 నలుగురు.కలిసి ఒక రూములో ఉంటున్నారు. తేదీ.04-1-2026 ఉదయం మృతుడు జెనేతు ద్వారా నుండి సెల్ఫోన్ లాక్కొని గొడవ పడుతూ అరుస్తూ ఉండడంతో ఖ3 మైనర్ బాలుడు మృతుడు జి నేత్ ద్వారా నుండి సెల్ఫోన్ లాక్కొని ఎందుకు గొడవ పడుతున్నా రణి అనగా దానికి మృతుడు ఎ3 మైనర్ బాలుడు ను చేతుల తో కొట్టినాడు దాంతో ఎ3 మైనర్ బాలుడు ఎ1 రాజేందర్ భీమల్ కు ఏ టు శుభ్రత్ కుమార్ కు చెప్పగా దాంతో ముగ్గురు కలిసి జితేన్ దర్వా ను చంపుదామని పథకం వేసి సాయంత్రం కూలి పనులు అయినా తరువాత రూముకి వచ్చినాక సుమారు ఐదు ముప్పై గంటల సమయంలో మేము ముగ్గురం కలిసి జితేన్ ద్వారా ను దొరకబట్టి ఎ1 రాజేందర్ భీమల్ ఎటు సుబ్బరాజ్ కుమార్ లము చేతులతో ఇష్టం వచ్చినట్లు ముఖంపై ముక్కుపై చెవిపై కడుపులో గుద్దినాము తరువాత ఏ వన్ టూ సుప్రాత్ కుమార్ మృతుడు జితేన్ ద్వారా యొక్క కాళ్లను నొక్కి పట్టినాడు ఏవన్ రాజేందర్ భీమల్ ఎ3 మైనర్ బాలుడు రాము రూమ్ లో ఉంటున్నటువంటి ఒక.టవాల్ తో రాజేందర్ మెడకు ఉరిబించి ఊపిరాడకుండా గట్టిగా ఉరివేసి చంపినారు అనంతరం ముగ్గురం కలిసి జ జితేన్ ద్వారా మృతదేహాన్ని రూముల నుండి బయటకు మూసుకొని వచ్చి బయట చెట్టు కింద పడి వేసి తరువాత అక్కడే ఉన్న ఇటువంటి మిగతా కూలీలకు అయినటువంటి ముసురు ద్వారా సునీల్ వద్దకు వెళ్లి జి నెట్ ద్వారా ను హత్య చేశాము అని వారితో చెప్పగా దాంతో వారు మా ఓనర్ చెప్పిన మనీ అనడంతో వారు భయపడి అక్కడి నుండి పారిపోయారు అనంతరం వారి వద్ద డబ్బులు లేకపోవడం వలన ఇంటికి వెళ్లలేక అడవి ప్రాంతాలలో తిరుగుతూ ఈరోజు అనగా తేదీ 6-1 2006 రోజున వారి యొక్క జజీతండబ్బులు అడిగి సామాన్లు తీసుకొని ఒరిస్సాకు పారిపోదామని వస్తుండగా ఆస్నాద్ ఎక్స్ రోడ్ వద్ద పోలీస్ వారు పట్టుకున్నారు అనంతరం వారి వద్ద హత్యకు ఉపయోగించిన ఒక టవల్ సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది నేరస్తులను వెంటనే పట్టుకోవడం లో కృషి చేసిన చెన్నూరు సిఐ దేవేందర్ రావు ఎస్సైలు సుబ్బారావు శ్యామ్ పటేల్ లను రామగుండం పోలీస్ కమిషనర్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జైపూర్ అభినందించారు.

## గంగాపురి సమీపంలో వృద్ధున్ని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం



**అక్షర వేదం/మంథని,జనవరి 6:**

మంథని పట్టణంలోని గంగాపురి తడల వాగు వద్ద ఎ్సైల్ బండి మీద ప్రయాణిస్తున్న వ్యక్తిని మంగళవారం రోజు రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో వృద్ధుడికి కాలు విరిగి,తీవ్ర గాయాలయ్యాయి.ఈ ప్రమాదానికి గురైన వ్యక్తి ముత్తారం మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా సమాచారం..

## మెడికల్ హబ్ గా కృషి.. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**అక్షరవేదం/గోదావరిఖని: జనవరి 06**

రామగుండం నగరాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అసెంబ్లీలో పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రామగుండంలో 350 పడకల సామర్థ్యంతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం అత్యవసరమని, దాని కోసం అవసరమైన నిధులు కేటాయించాలని అసెంబ్లీలో కోరారు. అదేవిధంగా, హృదయ సంబంధిత అత్యవసర చికిత్సల కోసం రామగుండంలో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్ సెంటర్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రజల ఆరోగ్య భద్రతే తమ ప్రాధాన్యమని, అత్యాధునిక వైద్య సదుపాయాలతో రామగుండం ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇయ్యాలి


**- మండల బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు లింగమల్ల సడవలి రావు**




**అక్షర వేదం/మహాముత్తారం, జనవరి 6:**

మహాముత్తారం మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు మహాముత్తారం మండలంలో తక్షణమే ప్రారంభించాలని మండల బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు లింగమల్ల సడవలిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదోడి సొంతింటి కల నెరవేరేదెన్నడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంకా ఎంతకాలం ఇల్లు ఇవ్వకుండా జాప్యం చేస్తారని ప్రభుత్వాన్ని దుయ్యబట్టాడు. మహాముత్తారం మండల కేంద్రంలో అనేకమంది పూరి గుడిసెలలో పరదాలు కట్టుకొని నివసిస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు నిజమైన అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశాడు. ప్రజాపాలన ప్రభుత్వమని నాయకులు చెప్పుకోవడం కాదని ప్రజలు చెప్పుకోవాలని విమర్శించారు. మహాముత్తారం మండలంలో తక్షణమే ఇందిరమ్మ ఇండ్ల జాబితా ప్రారంభించాలని అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశాడు.

## మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నేటి నుంచి ఫోటోగ్రఫీ టోర్నమెంట్




**అక్షర వేదం/ మహబూబాబాద్ జిల్లా కేంద్రం, ఎన్టీఆర్ స్టేడియం:- జనవరి 6.**

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల నుంచి హాజరుకానున్న క్రికెట్ టీం లు....భారీగా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు.. నేటి టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథిగా హాజరుకానున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.., ముఖ్యఅతిథులుగా హాజరుకానున్న మహబూబాబాద్ బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు యాళ్ళ మురళీధర్ రెడ్డి., మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంధాలయసంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు...

## ఇటిక్యాల సర్పంచ్ ను సన్మానించిన రాయికల్ జూనియర్ కళాశాల బృందం.



**అక్షర వేదం/రాయికల్ జనవరి 06**

రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయి రెడ్డి లను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, స్టాఫ్ మంగళవారం రోజున శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, గ్రామ నాయకులు మిట్టపల్లి గంగారెడ్డి, కనపర్తి శ్రీనివాస్ కళాశాల ప్రిన్సిపాల్ లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు గొప్ప చరిత్రాత్మిక వరాలిచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి,



**అక్షర వేదం/హైదరాబాద్:-జనవరి 6. హైదరాబాద్ ,**

ఆంధ్రప్రదేశ్, వికలాంగులకు 7 గొప్ప చరిత్రాత్మిక వరాలిచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ధన్యవాదములు తెలిపిన తెలంగాణ వికలాంగుల సంఘాలు నాయకులు. స్వర్గీయ పి. సాయిబాబు ( మాజీ వికలాంగుల సంస్థ ఛైర్మన్ ) ఇంటికి పరామర్శించడానికి వచ్చిన సందర్భంగాఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ని తెలంగాణ తరపున హైదరాబాద్లో కలిసిన సందర్భంగా...

మీ సేవలో...

నల్గొండ శ్రీను

వికలాంగుల నెట్ వర్క్ ఎన్.పి.డి.వో

జవాబు .. 9440360507

## వరంగల్ ఎంజీఎం కు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



**వరంగల్ ,జనవరి 6**

వరంగల్ నగరంలో విద్యా, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. వరంగల్ నగరంలోని ఎంజీఎం కు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య నిమిత్తం వస్తుంటారని, హాస్పిటల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కి కాకతీయ యూనివర్సిటీలో భూమి కేటాయిస్తుండగా, కొందరు అడ్డుపడుతున్నారని తెలిపారు.

## చేతి కర్రలతో నడువాలనుకున్నాడు.అవి ఎక్కడ దొరుకుతాయో అని ఎదురు చూస్తున్న నాకు గుత్తికొండ కిరణ్ చేత అవి నా చేతి కి అందడం ఎంతో ఆనందంగా ఉంది.గుత్తికొండ కిరణ్ కి నేను కృతజ్ఞడను.



**అక్షర వేదం/చౌటుప్పల్ మండలం, చిన్న కొండూర్ గ్రామం :- జనవరి 6.**

యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ మండలం, చిన్న కొండూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ కు గత కొన్నిరోజుల క్రితం ప్రమాదంలో తన కుడి కాలు కోల్పోవడం జరిగింది చేతికర్రలతో నడవాలని అనుకున్నాడు. కాని అవి ఎక్కడ దొరకుతాయో ఎవరు ఇస్తారో అని ఎదురు చూస్తున్న సమయంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి, రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ ని కలవగ వారు ఈరోజు వారి ఇంటికి పిలిచి వెంకటేష్ కు చేతి కర్రలు అందజేయడం జరిగింది.

# పోలీసుల జీవితాల్లో దాగున్న చీకటి కోణం, వృత్తిధర్మంతోఎదురీత ఉపోద్ఘాతం

**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు రెవెన్యూ డివిజన్:-జనవరి 4 .**

దేశ పౌరుల హక్కుల,శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా అంతర్గత ప్రభుత్వంగా చలామణి అవుతున్న పోలీస్ వ్యవస్థలో దాగున్న, బహిర్గతంకాని అంతర్లీనశీగా దాగున్న చీకటి కోణాన్ని,సాటి పౌరులుగా,వారి విద్యుక్తధర్మం నిర్వహణలో తీక్షణంగా పరిశీలిస్తే,ఒళ్ళు జలదరించే విషయాలెన్నో ప్రస్ఫుటమవుతాయి.పోలీసు విభాగాలలో ప్రధానంగా క్రైం,సివిల్, ట్రాఫిక్,ఎక్సైజ్,ఫైర్,డిటెక్టివ్, యూనిఫామ్డ్ తదితర విభాగాల పోలీసు బృందం జీవితాలను అధ్యయనం చేస్తే, నాణానికున్న మరో కోణం ఆవిష్కృతమౌతుంది.ఇటీవలి కాలంలో హింసాత్మక, ఆస్తి,ఆర్థిక,సైబర్,మారకద్రవ్యశీ లాంటి క్రిమినల్ మరియు సివిల్ కేసుల నమోదు సంఖ్యాపరంగా పెట్రేగిపోతున్నది.ముందుగా పోలీసుల విధివిధానాలపై భారతీయ న్యాయ సంహితలో ఉటంకించిన విషయంపై పట్టు సంపాదించాలి.సంహితలో పేర్కొన్నట్లుగా పోలీసులలో నిస్వార్థత,సమగ్రత,నిష్పాక్షకత,జవాబుదారీతనం, నిష్కాపటత్వం,నిజాయితీ, నాయకత్వం మొదలగు 9 సూత్రాల సంయమనంతో వారు వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్నారు.

**కాలమాన పరిస్థితుల ప్రభావం:**

ఒకనాడు సమాజంలో ఖాకి డ్రెస్ అంటేనే భయభ్రాంతికి లోనైన సమాజముండేది. అబశ్రీశ్రీ నేడది భుజం భుజం రాసుకునే స్థితికి సమాజఛాయల విష సంస్కృతికి భీజం పడింది. ఇది ఆరోగ్యమా?అనారోగ్యమా? ఆ చర్చను పక్కన పెడదాం!ఇది సమాజంలో పోలీసులకు పౌరులకు మధ్యఉన్న పారదర్శకతకు అద్దం పడుతుంది.అంటే ఫ్రెండ్లీ పోలీస్ అనే పదం కొత్త రూపం దాల్చిందనవచ్చు.

**జీవనోపాధి దిశగా తొలి అడుగు:**

నేటి యువత పోలీసు ఉన్నతాధికారులుగా పనిచేయాలని ఫ్యాషన్ గా కొందరిలో ఉంటే,మరికొందరు ఇదొక జీవనోపాధి రంగంగా ఎంచుకొని తొలి అడుగు వేసిన సందర్భాన్ని సైతం మనం గమనంలోకి తీసుకోవాలి.

ఒక ఉద్యోగానికి ప్రయత్నిస్తే,ర్యాంకు తగ్గడం మూలాన కిందిస్థాయి ఉద్యోగంలో ఎంపికవడంతో,బతుకు బండిని మోసే దిశగా ఇంకా ఏమి చేసేదేమీ లేక అబశ్రీశ్రీ అలా ఓ ఉపాధి రంగంగా భావించి జాయిన్ అవుతున్న సందర్భాలు కోకొల్లలు.

**ఒక్కో పనికి ఒక్కో ఏజెన్సీ:**

బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్,సశస్త్ర సీమ బల్,సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్,నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఇంటెలిజెన్స్ బ్యూరో,ఆర్ అండ్ డబ్ల్యూ అబశ్రీశ్రీ(విదేశీ గూఢచార సంస్థ),నేషనల్ సెక్యూరిటీ గార్డ్ తదితర విభాగాల్లో అబశ్రీశ్రీ పోలీసు వ్యవస్థ తమకు కేటాయించిన విధులను నిర్వహిస్తోంది.

కుటుంబ బాధ్యతలకు అల్లంతదూరం:

24/7 ఈ కొలమానం, ప్రమాణీయతల నేపథ్యంలో పోలీసు ఉద్యోగంలో చేరిన వారంతా,తమ వృత్తి ధర్మం, పని ఒత్తిడి వల్ల తల్లిదండ్రుల, భార్యా పిల్లల మంచి చెడులను చూసుకునే బాధ్యతలకు దూరమవుతున్న రోజులను నిక్కచ్చిగా అంచనా వేయలేము.వారి జీవితంలో తోడూ నీడ ఓ ఎండమావిని తలపిస్తుంది.తద్వారా ప్రశాంతత కరువైన జీవనంలో








పడి నలిగిపోతున్నారు. అనునిత్యం తెలియని ఉద్వేగంతో సహజీవనాన్ని కొనసాగిస్తున్నారు.ఇది వారి సమీప భవిష్యత్తులో అనారోగ్యానికి హేతువు అవుతుంది.ఇలా జీవితంలో సంతృప్తి మిగిల్చని రోజులెన్నో వారిని నిత్యం వేధిస్తునేన్నాయి.

**జవాబుదారీతనంలో ఓ శాసనం:**

క్రిమినల్ కేసుల నిందితులను సకాలంలో గుర్తించడంలో వారి శక్తియుక్తుల్ని,నైపుణ్యాన్ని ఉపయోగించి నిజాన్ని నిగ్గు తేల్చాల్సిన బాధ్యత వారి భుజస్కందాలపై ఉంది.

ఆ కోణంల్లో నిందితుల వివరాలను తెలుసుకోవడానికి సాంకేతిక ఆధారాలైన కాల్ డేటా,సిసిటీవీ ఫుటేజ్,సెల్ టవర్ లోకేషన్ లాంటి అంశాలపై సంపూర్ణ అవగాహనతో పాటు,పోలీసు జాగిలాల వినియోగం,ఫోరెనిక్స్ నిపుణులతోసంప్రదింపులు జరిపితేనే, నేర పరిశోధనలో జవాబుదారీతనంగా వ్యవహరించినవారౌతారు.ఇది ఒక శాసనం.నేర పరిశోధనలో నేరస్తులను పట్టుకోవడం ఒక భాగమైతే,ఆ కేసులోని మూలాల్లోకి వెళ్లి వీలైనన్ని ఆధారాలు సేకరిస్తేనే,శిక్ష పడే అవకాశముంటుంది.లేదంటే,కోర్టులో ఆ కేసు తేలికగా వీగిపోయే ప్రమాదమూ లేకపోలేదు.సంపూర్ణ ఆధారాలకై లోతుగా పరిశోధించాలి.విశ్లేషించాలి.

**రాజ్యాధికారం బదలాయింపుతో చిక్కుముడుల పర్వం:**

రాజ్యాధికారమనేది ఏ పార్టీకి వారసత్వంగా రాదుఅబశ్రీశ్రీ కదా! ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరిచ్చే అంతిమతీర్పుతో రాజ్యాధికారం ఒకరి నుంచి మరొకరికి బదలాయింపు సుసాధ్యమే.ఇలా ఒకరి చేతి నుండి మరొక చేతికి రాజ్యాధికారంఅబశ్రీశ్రీ మారినప్పుడల్లా బాగా కృంగిపోతున్నది. నలిగిపోతున్నది పోలీసు వ్యవస్థఅని చెప్పక తప్పదు. కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందంగా వారి వృత్తి ధర్మం చక్ర భ్రమణంలో పరిభ్రమిస్తున్నది.ఒక్కోసారి ప్రాణ సంకటంగా మారుతున్నది.ఈ సందర్భంగా పై అధికారుల ఒత్తిళ్ల నేపథ్యం మానసిక ఘర్షణకు సైతం తావిస్తున్నది.అంటే రాజకీయ కక్ష్యలకు బలి పశువులయ్యేది పోలీసులే.అంచల వ్యవస్థలో అవస్థలెన్నో: డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి),అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (అడిషనల్ డిజిపి),ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజిపి), డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిఐజిపి), సీనియర్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (యస్ యస్ పి),అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (అడిషనల్ యస్ పి),డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్(డి యస్ పి),ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సిఐ),సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (యస్ ఐ),హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్ ఇలా ఈ అంచల వ్యవస్థలో ఒకరిపై ఒకరికి,వృత్తి ధర్మంలో ఏర్పడ్డ ఓ చిన్న అగాధం వల్ల చివరగా కింది స్థాయి ఉద్యోగులు ఇబ్బంది పడే పరిస్థితులను గమనించవచ్చు. క్రమంలో వారు పడే మానసిక వేదనను తూకం వేయలేము.

సామాజిక మాధ్యమాల ప్రభావం:ఎక్కడ ఏ మూలన చిన్న నేరం జరిగినా క్షణాల్లోనే అబశ్రీశ్రీ ఎలక్ట్రానిక్ మీడియా ట్రోలింగ్ ద్వారా సభ్య సమాజానికందుతున్నది.

ఇది పోలీసులకొక సవాలుగా పరిణమించింది.వివిధ ఛానళ్లువారి వారి వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడంలో తప్పులేదు. కానీ ఆ సమస్యను ఛేదించే క్రమంలో పోలీసుల పాత్ర అద్వితీయమైనది.నిఘా వ్యవస్థ సహకారంతో అవసరమైతే పోలీసు జాగిలాలు లేదా మొబైల్ ఫోరెనిక్స్ నిపుణుల బృందం సహాయ సహకారాలతో ఆ కేసు పూర్వపరాలను నిగ్గు తేలిస్తే సరే సరి.లేదంటే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారంతో,అలర్ట్ అయిన పై అధికారుల ఒత్తిడిని తట్టుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదు. అరచేతిలో పోక చెక్కలా, రెంటికి చెడిన రేవడిలా చేస్తున్న వృత్తిపై,అసహనం దాడి చేస్తుంది.తద్వారా జరిగే పరిణామం ఊహించటం కష్టమే.ఉరిమి ఉరిమి పిడుగు ఊరిపై పడ్డట్టు,కేసు ఆసాంతం పోలీసుల చుట్టూరా తిరగాడుతుంది.అబశ్రీశ్రీఅలా చేయని నేరానికి పరాభవాన్ని సైతం అనుభవించాల్సివస్తుంది

మైనింగ్,ఇసుక,భూదందాలు,కల్తీ సామ్రాజ్యం:

అబశ్రీశ్రీఇదొక భారీస్థాయీ నేరం.బడా బడా నేతలతో సంబంధాలున్న ఈ స్థాయి నేరంఅబశ్రీశ్రీ పరిశోధనలో వెలువడే చేదు నిజాలను వెలికితీయడం వల్ల,నిజాయితీ పోలీసుల అవస్థలు ఇక మాటల్లో చెప్పలేము.ఒక్కోసారి వారిని ఉద్యోగం విడిచి పారిపోయేలా చేస్తుంది.చేయని నేరానికి శిక్ష అనుభవిశీచటం ద్వారా ఆత్మహత్యే శరణ్యమన్న సందర్భాలూ అక్కడక్కడా కనిపిస్తాయి.

నక్సలిజంతో పోరుబాట::

కీకారణ్యంలో జరిగే నక్సలైట్ల అణచివేతలో,ఎదురెదురు కాల్పుల్లో,అటు శత్రుమూకపై దాడి జరుగుతున్న క్రమంలో తమ ప్రాణాలు సైతం గాలిలో కలిసిపోయిన సందర్భాలు మనసును కలిసి వేస్తాయి

నేర దర్యాప్తు,ఏబిసిడి అవార్డుల ప్రోత్సాహం:

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, శీఘ్రగతిన,నాణ్యంగా నేర దర్యాప్తును పూర్తి చేసిన వారికి ఏబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్ )అవార్డుతో పోలీసుఅబశ్రీశ్రీ ఉన్నతాధికారులఅబశ్రీశ్రీ బృందం అభినందించటాన్ని స్వాగతిద్దాం! ఆత్మస్థైర్యం,మనోధైర్యమేకొండంత అండ:

శాంతి భద్రతలను పరిరక్షస్తూ, నేరాలను నిరూపిస్తూ, నేరస్థులను గుర్తిస్తూ,ట్రాఫిక్ నిర్వహణ సక్రమంగా చేస్తూ, చట్టాల అమలులో నియంత్రణను పాటిస్తూ, ముందుకు వెళ్లాల్సిన చారిత్రక సత్యాన్ని గ్రహించి,ప్రధానంగా యువత ఈ ధ్యేయంతో ఇదే స్ఫూర్తితోఅబశ్రీశ్రీ వృత్తిలో చేరి, న్యాయంకోసం,ధర్మంకోసం పరితపించే వర్గాలకు సేవచేసే ఓ మహాయోగంగా ఈ వృత్తిని స్వీకరిస్తే,వృత్తి గౌరవం మరింత కీర్తి పతాక స్థాయికి చేరుకుంటుంది.సంక్షభంలోంచి జనాన్ని సంక్షమం దిశగా, నడిపించే కోణంలో యువత అడుగుపడాలని ఆశిద్దాం!!

నేర ప్రవృత్తి విజృంభణ:

అనునిత్యం ఎక్కడో ఒకచోట హత్యలు,దోపిడీలు,దొంగతనాలు,మాదకద్రవ్యాలు (డ్రగ్స్)బాంబులు (ఎక్స్ ప్లోజివ్) తదితర నేరచరిత చర్యలు జరగడం షరా మామూలైంది.తద్వారా పోలీసులపై పెనుభారం,మానసిక ఒత్తిడి బాగా పెరిగింది. అనునిత్యం ఏదో ఒకచోట నిరసనల ప్రతిరూపాలే:

ప్రజా సమస్యలపై పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అనునిత్యం తమ నిరసనగళాన్ని, ధర్నాలు,రాస్తారోకోలు, పికటింగ్ లు,బంద్ లు, దిష్టిబొమ్మల దహనాలు, నిరాహారదీక్షలతోపాటుగా, సామూహిక ఊరేగింపులు,బైక్ ర్యాలీల రూపంలో స్పందిస్తున్నాయి.ఈ సందర్భంగా జరిగే అవాంఛనీయ సంఘటనల నేపథ్యంలో,ముందస్తు చర్యగా అందుకు ప్రత్యామ్నాయంగా చేపట్టే క్రమంలో,అదనపు బలగాల మోహరింపుతో పాటుగా,స్థానిక పోలీసులను సైతం ప్రశాంత వాతావరణశీకోసం ప్రత్యేక విధి నిర్వహణలో భాగస్వామ్య చేయటానికి నియుక్తులను చేయడం,దూర భారాలవల్ల పోలీసులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

**శాశ్వత పరిష్కారం:**

చిన్న పెద్ద తేడా లేనివిధంగా, అధికార బృందమంతా, సహకార భావంతో సమన్వయంతో కలిసి కృషి చేస్తే,ఒకరి భావాన్ని మరొకరు గౌరవిస్తే పోలీస్ వ్యవస్థపై ఉన్న అపనమ్మకశీ పోయి,సమాజ గౌరవం ఇనుమడిస్తుంది. పోలీసుల ఆత్మగౌరవం కూడా కొత్త రెక్కల తొడుక్కుంటుంది.

**వ్యాసకర్త:**

పరాశీకుశం రఘు నారాయణ
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
గ్రామం:తొర్రూరు
మహబూబాబాద్ జిల్లా
చరవాణి: 9949749987.

# సాంస్కృతిక ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

**రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన టీపీసీసీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్**




**హైదరాబాద్, జనవరి 6 అక్షర వేదం**

ఏఐసీసీ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని హైదరాబాదులోని వారి నివాసంలో టీపీసీసీ సాంస్కృతిక సేన ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆట, పాటలతో పల్లె పల్లెను చైతన్యం చేసిన నిజమైన ఉద్యమ కళాకారులకు గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగిందని ప్రతినిధులు వివరించారు.తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలను ఉద్యమ స్ఫూర్తితో మేల్కొలిపిన సాంస్కృతిక కళాకారులు నేటికీ ఉపాధి, భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యం ప్రజాపాలనలో అయినా వారికి న్యాయం జరగాలని కోరారు. ముఖ్యంగా 'సాంస్కృతిక సారధి'లో ఉద్యోగ అవకాశాలు కల్పించి కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని టీపీసీసీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మండల సాంస్కృతిక సేన అధ్యక్షులు కొమ్ము ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు కొమ్ము అంజితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.